నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | ఏప్రిల్ 4, 2024 | www.navatelangana.com

ఎవరైన అనుమానంగా కనిపిస్తే తెలియజేయాలి

- దాడి చేస్తే చట్ట ప్రకారం చర్యలు : సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎవరైన అనుమానస్పదంగా సంచరిస్తున్నారని తెలిస్తే లేదా ఎవరైన దొంగలు అని అనుమానించిన లేదా గుర్తుతెలియని వారు అనిపిస్తే వారి సమాచారాన్ని దగ్గరలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు లేదా 100 టోల్ ఫ్రీ ఎమర్జెన్సీ నెంబర్‌కు తెలియజేయాలని పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలో కొంత మంది అనుమానంతో తిరుగుతున్నారని వారిని పట్టుకొని కొట్టడం వలన తీవ్రగాయాలపాలైయ్యారని, రెండు ఘటనల్లో చనిపోయారని తెలిపారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కొట్టిన వారిని పంపినట్టు తెలిపారు.

ఎవ్వరు చట్టాన్ని చేతులోకి తీసుకొని అనుమానస్పద వ్యక్తులపై దాడి చేయొద్దని కోరారు. ఎవ్వరైన దీనికి వ్యతిరేకంగా దాడిచేసిన లేదా కొట్టినట్లయితే అటువంటి సంఘటనలపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కుమారుడి వివాహ వేడుకలు

- వధూవరులను ఆశీర్వదించిన పార్టీ నాయకులు

నవతెలంగాణ-వర్ని


వివాహ వేడుకకు హాజరైన పార్టీ నాయకులు

సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అనిత దంపతుల పెద్దకుమారుడు ప్రీతం బాబు-దేవి ప్రియ వివాహ వేడుక బుధవారం పాతవర్నిలో అట్టహాసంగా జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ నాయకులు ఎస్‌వి రమ, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు హాజరై నవదంపతులను ఆశీర్వదించారు.

బీజేపీ కబంధ హస్తాల నుంచి
దేశాన్ని రక్షించుకుందాం

- బీజేపీ, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపు


మాట్లాడుతున్న పాలుడుగు బాస్కర్

నవతెలంగాణ-వర్ని

బీజేపీ మతతత్వ కబంధ హస్తాల నుంచి దేశాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతి భారతీయుడుపై ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బిజెపి మతతత్వ కార్మిక రైతు వ్యతిరేక మోడీ విధానాన్ని దిక్కరించి, ప్రజాస్వామ్య ఇండియా కూటమిని అభ్యర్థులను ఎన్నుకునే సువర్ణ అవకాశం ప్రజల చేతుల్లో ఉందని తెలిపారు. బిజెపి దాని మిత్ర పార్టీలను చిత్తుగా ఓడించాలని, ఇండియా కూటమిని గెలిపించేందుకు భారతీయులు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకొని బిజెపి అభ్యర్థులను ఓడించేలా చైతన్య పరిచే బాధ్యత మనందరి పైన ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ రమ, నూర్జహాన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ గౌడ్, వెంకటేష్, జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్, నన్నే సాబ్, యేశాల గంగాధర్, మారి, సుజాత, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కీచక
ఉపాధ్యాయుడు

- గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ వివరిస్తుండగా షీ టీమ్ ఎదుట బోరుమన్న విద్యార్థినులు
- అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు



నవతెలంగాణ-లింగంపేట్

విద్యాబుద్ధులు నేర్పాల్సిన పలువురు ఉపాధ్యాయులు కీచకులుగా మారుతున్నారు. అభం శుభం తెలియని విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉపాధ్యాయుడి వృత్తికే మచ్చను తీసుకొస్తున్నారు. తాజాగా లింగంపేట్ మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది.

ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా శ్రీనివాస్ శర్మ ఆరు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో మహిళా ఉపాధ్యాయులపై అసభ్యంగా ప్రవర్తించడంతో ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. అయితే కొంత కాలంగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఏడో తరగతి విద్యార్థిని షీ టీమ్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో రెండు రోజుల క్రితం షీ టీమ్ ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో సదరు ఉపాధ్యాయుని కీచక పర్వం వెలుగుజూసింది. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ శర్మ మద్యం సేవిస్తూ వచ్చేవాడని, మద్యం మత్తులో బాలికలతో చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. షీ టీం సభ్యులు ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లగా.. విచారణ చేపట్టి ఫోక్సో కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. గురువారం రిమాండ్‌కు తరలించనున్నట్టు తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు దోమకొండ మండల కేంద్రంలో చెందిన వాడని ప్రస్తుతం కామారెడ్డి సమీపంలోని గురు రాఘవేంద్ర కాలనీలో ఉంటున్నట్టు తెలిపారు.

సంతల వేలంలో..
సంచలన నిర్ణయం

- గత ఏడాది గరిష్ట వేలం పాటదారుడికే రెన్యువల్!
- పంచాయతీకి పెరిగిన ఆదాయం
- సామాన్య ప్రజల హర్షం..
- నవతెలంగాణ వరస కథనాలకు స్పందన



నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ మేజర్ గ్రామపంచాయతీ మేకల, వారాంతపు సంతల వేలంలో పంచాయతీ ఆదాయానికి ఘననీయంగా గండి కొట్టాలని చూసిన సిండికేట్ గాళ్ళ బాగోతంపై నవతెలంగాణ వరుస కథనాలకు స్పందించిన జిల్లా పాలన అధికారి కళ్లెం వేశారు. వేలం పాటకు అప్‌సెట్ ధర రాక పోవడంతో వేలం వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నవీపేట్ మేకల, వారంతపు సంతలకు అప్సెట్ ప్రైస్ రాకపోవడం, సిండికేట్ తీరుపై పత్రికలలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో నవీపేట్ మేకల, వారంతపు సంతలను సైతం ఏప్రిల్ ఒకటి నుండి జూన్ మొదటి వారం (10 వారాల) పాటు గత 2023-24 ఏడాది గరిష్ట వేలం పాటదారుడికి రెన్యువల్ చేయాలని సర్క్యులర్ జారీ చేశారు. దీంతో నవీపేట్ పంచాయతీకి సంతల వేలం ద్వారా వచ్చే ఆదాయం నష్టపోకుండా కాపాడినట్లయిందని సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గరిష్ట పాటదారుడు గత కాంట్రాక్టర్ లే సిండికేట్ ను ప్రోత్సహించింది ఒకరే అయినప్పటికీ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వేలంలో పాల్గొన్న మిగతా పటాదారులకు మినిమమ్ గుడ్ విల్ అందించడం విశేషం.

శాస్త్రీయ విద్య..
విద్యార్థుల హక్కు

- నూతన విద్యా విధానం రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్

నవతెలంగాణ-జుక్కల్

శాస్త్రీయ విద్యా.. విద్యార్థుల హక్కు అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ అన్నారు. మూఢత్వం బోధించే నూతన విద్యావిధానం-2020 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రెండో మహాసభ విజయవంతమైనట్టు తెలిపారు. జుక్కల్ మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మహజన సభ వేదికగా విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించాలని, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ప్రతి విద్యార్థికి ఇవ్వాలని, విద్యను ప్రయివేటీకరణ చేయొద్దని, ప్రభుత్వ విద్యసంస్థలను పెంచాలని కోరారు. నియోజక వర్గంలోని విద్యార్థులను ఐక్యం చేసి విద్యరంగంలోని సమస్యలను పరిష్కరింపచేయాలని, ప్రభుత్వ విద్య వ్యతిరేక విదానాలను విద్యార్థుల బలంతో అడ్డుకోవాలని అన్నారు.

జుక్కల్ డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక..

కామారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా షేక్ జునేద్, కార్యదర్శిగా గడ్డపువార్ సాగర్, ఆఫీస్ బేరర్స్, ఉపాధ్యక్షులు ఈశ్వర్, షేక్ పిర్దోస్, సహాయ కార్యదర్శి మష్టాజీ, నాగరాజు, కమిటి సభ్యులు రాహుల్, అక్షయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాజిద్ హుస్సేన్

ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్
- ఉప్లూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవద్దని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని ఎఫ్‌సిఐ ప్రమాణాలను పాటించి ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధర పొందాలని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని రైతులకు సూచించారు.

కార్యక్రమంలో భీంగల్ ఏడిఏ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారిని బద్దం లావణ్య, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఆర్ఐ శరత్ కుమార్, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్, డైరెక్టర్ రేంజర్ల మహేందర్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, సాయిరాం, సీఈఓ శంకర్, వీడిసి క్యాషియర్ బి.రమేష్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం మత మధ్యం విద్వేషాలు

- అవి రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని బీజేపీ యత్నం
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలి
- సెమినార్‌లో హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ పిలుపు



వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఓట్ల కోసం మతం మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. రానున్న లోక్ సభలో ఎన్నికలలో మతతత్వ బీజేపీని ఓడించాలని' హై కోర్టు రిటైర్డ్ జడ్జి చంద్ర కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి, మల్లుస్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు' అనే అంశంపై నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సెమినార్ నిర్వహించారు. సమితి కన్వీనర్ డా. రవీంద్ర నాథ్ సూరి అధ్యక్షత వహించారు.

రోడ్డెక్కిన పాడి రైతులు

- విజయ్ పాల బిల్లులు రెండు నెలలుగా రావట్లేదని ఆగ్రహం
- ఇరువైపులా నిలిచిన వాహనాల రాకపోకలు


వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-కోటగిరి

విజయ పాలకేంద్రం వారు రెండు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాడి రైతులు ఆందోళన చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 68 మంది రైతులు విజయ పాల కేంద్రంలో ప్రతిరోజు 350 లీటర్ల పాలను పోస్తున్నట్టు తెలిపారు. 15 రోజులకు ఒకసారి సుమారు మూడున్నర లక్ష రూపాయలు బిల్లు చెల్లించవలసి ఉంటుందని, కానీ ఇప్పటివరకు మూడు బిల్లులు రాకపోవడంతో రుణాలు చెల్లించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పు చేస్తే తలవంచుతా..

- ఓర్వలేకనే నాపై విమర్శలు
- ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్


మాట్లాడుతున్న మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నాలుగేళ్ల చైర్మన్ పదవి కాలంలో ఏ ఒక్క చిన్న తప్పు కుడా చేయలేదని తప్పు చేసినట్టు నిరూపిస్తే తలవంచుతానని, తనపై కావాలనే కొందరు ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా చైర్మన్ పదవి నుంచి తప్పించలనే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని కొందరు డైరెక్టర్లను కావాలని లోబర్చుకుని అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, తను ఏ తప్పు చేశానని, తనకు ఇంత ఇబ్బందులకు గురి చేయడమేంటని ప్రశ్నించారు. బుధవారం ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి సహకార సొసైటీ మహాజన సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి సొసైటీ చైర్మన్ సాంబార్ మోహన్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు నడ్చు కోవాల్సి ఉంటుందని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో ఆనాటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తనకు ఐ డి సిఎంఎస్ చైర్మన్ పదవి కట్టబెట్టారని ఆ పదవికి వన్నె తెచ్చి అభివృద్ధి, లాభాల బాటలో తీసుకురావడం జరిగిందన్నారు. కానీ గ్రామంలో ఉన్న కొందరు నాయకుల వల్ల తనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తను చైర్మన్ గా చేసినప్పటి నుండి పార్టీలకు అతీతంగా తనవద్దకు ఎవరు వచ్చినా వారి కష్టసుఖాల్లో పాలు పంచుకున్న తప్ప ఎవరికీ నయా పైసా నష్టం చేకూర్చడమే కాకుండా ఎలాంటి ఆక్రమాలకు పాల్పడలేదని, ఎవరైనా ముందుకు వచ్చే నిరూపిస్తే దేనికంటే దానికి సిద్ధమన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఒక ప్రముఖ వైద్యుడుగా, ఉన్నత చదువులు చదివి అన్ని తెలిసిన వ్యక్తి ప్రస్తుతం మన ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఉన్నారని, కానీ కొందరు తనపై కుట్రపాన్ని ఎమ్మెల్యే కు కావాలని లేనిపోని మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరకుండా అడ్డుకుంటున్నారన్నారు. తాను కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నా కొందరు కావాలని తనపై లేనిపోని వైరాగ్యం సృష్టిస్తున్నారని అన్నారు.

యూనివర్సిటీలో గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో పోటీ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.వి.రమణాచారి ఆధ్వర్యంలో గ్రూప్ 1 పరీక్షలకు బుధవారం తరగతులను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం యాదగిరి పాల్గొని మాట్లాడుతూ.. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశం రాష్ట్రస్థాయిలోని ప్రసిద్ధ కోచింగ్ సెంటర్ల నుండి నిష్ణాతులైన అధ్యాపకులను ఆహ్వానించి విద్యార్థులకు తరగతులను నిర్వహించాలని, లైబ్రరీ పుస్తకాలను అందుబాటులో ఉంచాలని అదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని అధిక సంఖ్యలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ అర్హత పొందితే మెయిన్స్ కు కూడా అనుభవం గల అధ్యాపకులచే తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ అరతి మాట్లాడుతూ సమయం వధా చేసుకోకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ ఇండియన్ పాలిటి గురించి తనదైన శైలిలో సులభమైన మార్గంలో భారత రాజకీయాలపై సమగ్రమైన అవగాహన కల్పించారు. గురువారం నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కాంపిటీటివ్ సెల్ డైరెక్టర్ రమణాచారి కోరారు.

తెలంగాణ యూనివర్సిటీ లో పరీక్షల విభాగానికి సంబంధించి అన్ని రకాల ఫీజులు గతంలో ఉన్నట్టుగానే ఫీజు స్ట్రక్చర్ ఉంటుందని విద్యార్థులకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి హామీ ఇచ్చారు.



ఎంఎస్ఎన్ కంపెనీలో ప్రమాదం

- కెమికల్ మీదపడి కార్మికుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ శివారులో ఎం.ఎస్.ఎన్ కెమికల్ కంపెనీలో ప్రమాదం చోటుచేసుకుంది. కెమికల్ మీద పడటంతో కార్మికుడికి తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామయంపేట్ మండలం జాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ అనే వ్యక్తి ఎంఎస్ఎన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం సి బ్లాక్ లో కెమికల్ పోసి మ్యాన్ వాల్ మూసేసిన తర్వాత సరైన సమయంలో నైట్రోజన్ అందని కారణంగా ఒత్తిడి తట్టుకోలేక సేఫ్టీ మ్యానువల్ పక్కకు జరిగింది. కెమికల్ ఒక్కసారిగా సంజీవ్‌పై పడడంతో సంజీవ్‌కు చేయి, తల వెంట్రుకలు కాలిపోయాయి. కంపెనీ యాజమాన్యం హుటాహుటిన సంజీవ్ కు కంపెనీలోనే ప్రథమ చికిత్స నిర్వహించి హైదరాబాద్ లోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో సంజీవ్ ఒక్కడికే ప్రమాదం జరిగిందా లేదా మరో ఇద్దరికి ప్రమాదం జరిగిందా తెలియాల్సి ఉంది. కంపెనీ యాజమాన్యం సమాచారం బయటకు పొక్కకుండా సి బ్లాక్ ని పూర్తిగా శుభ్రం చేసి ఎలాంటి ప్రమాదం జరగనట్లు ఎవరికి ఎలాంటి సమాచారం తెలియకుండా ప్రమాదం జరిగిన వ్యక్తిని హైదరాబాద్ తరలించారు. కుటుంబీకులు కంపెనీకి ఫోన్ చేసిన చిన్న ప్రమాదమే జరిగిందని పెద్ద ప్రమాదం ఏమి జరగలేదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

ఏది ఏమైనప్పటికీ కెమికల్ కంపెనీ ద్వారా మరో ఐదు సంవత్సరాలలో కంపెనీలో పని చేసే కార్మికులకే కాకుండా, భిక్కనూరు మండల ప్రజలకు పెను ప్రమాదం తప్పదు. ప్రస్తుతం కంపెనీ నుండి వస్తున్నావా కెమికల్ వాసన కారణంగా ఊపిరి ఆడకుండా అనారోగ్యం పాలవుతున్న ప్రజలకు భవిష్యత్తులో రియాక్టర్లు పేలితే ప్రజల ప్రాణాలు పోవడం ఖాయమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాడమాడుతున్న కెమికల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, సమీప గ్రామాలలో ఏర్పాటు చేయకుండా నిర్మానుష్య ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కెమికల్ కంపెనీలపై చర్యలు తీసుకుంటారా తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటారా వేచి చూడాలి.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని తాడేం స్టేషన్ పరిధిలో గురువారం రోజు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మోపాల్ ఏఈ బాబా శ్రీనివాస్ బుధవార ఒక ప్రకటనలో తెలిపారు.

మోపాల్ మండలంతో పాటు చుట్టుపక్కల గల రూరల్ పరిధిలో వివిధ మండలాల వినియోగదారులు సైతం పాల్గొనచ్చని తెలిపారు. ఇట్టి సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోని విద్యుత్ సమస్యలను ప్రస్తావిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌కో డిఈ ఉత్తమ్ జాడే హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ఆలయంలో విగ్రహాభిషేకం


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో శ్రీ లక్షణా సహిత సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మూడవరోజు విగ్రహ అభిషేకం నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాలా గణేష్ గుప్త అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విగ్రహాల కు జాలాదివాసం నుంచి తీసి విగ్రహబిషేకం చేశారు. అనంతరం ధాన్యది వాసంలో ఉంచారు. సాయంకాలం మహిళలతో కుంకుమార్చన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువకులు, గ్రామ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కొనసాగిన ప్రక్రియ
- పర్యవేక్షించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంటు సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను బుధవారం పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలకు కేటాయించాల్సి ఉన్న కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరిస్తూ, ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ పై పారదర్శకంగా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను ప్రతినిధులకు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ శాసనసభ నియోజకవర్గాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్లు కేటాయించడం జరుగుతుందని, ఆయా సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూమ్ లలో కట్టుదిట్టమైన భద్రతా నడుమ వాటిని భద్రపరుస్తామని కలెక్టర్ తెలిపారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 1550 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను రిజర్వ్ లో ఉంచడం కోసం కేటాయిస్తున్నామని, 40 శాతం వి.వి.ప్యాట్ లను రిజర్వ్ లో ఉంచేలా అదనంగా కేటాయిస్తున్నామని అన్నారు.

బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్‌కు కూడా నిజామాబాద్ జిల్లా నుండే ఈవీఎంలు కేటాయించనున్నట్టు తెలిపారు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల నాటికి జిల్లాలోని ఆరు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 1549 పోలింగ్ కేంద్రాలే ఉండగా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రస్తుతం బాల్కొండ సెగ్మెంట్లో అదనంగా మరో ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా మరో 25 శాతం అదనంగా లెక్కిస్తూ 217 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉన్న ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు 271 బ్యాలెట్ యూనిట్లు, అంతే సంఖ్యలో కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా లెక్కిస్తూ 303 వి.వి.ప్యాట్లు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఇదేవిధంగా 246 పోలింగ్ కేంద్రాలు కలిగిన బోధన్ సెగ్మెంట్ కు 307 చొప్పున బీ.యూ, సీ.యూలు, 344 వివి.ప్యాట్లు, 258 పోలింగ్ స్టేషన్లు కలిగిన బాన్సువాడ నియోజకవర్గానికి 322 చొప్పున బీ.యూ, సీ.యూలు, 361 వివి.ప్యాట్లు, 289 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉన్న నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ కు 361 చొప్పున బీ.యూ, సీ.యూలు, 404 వివి.ప్యాట్లు, 293 పోలింగ్ కేంద్రాలు గల నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 366 చొప్పున బీ.యూ, సీ.యూలు, 410 వివి.ప్యాట్లు, 247 పోలింగ్ కేంద్రాలు కలిగిన బాల్కొండ శాసనసభ నియోజకవర్గానికి 308 చొప్పున బీ.యూ, సీ.యూలు, 345 వివి.ప్యాట్లను ర్యాండమైజేషన్ జాబితా ప్రకారంగా కేటాయించనున్నట్టు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండ పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపడుతున్నామని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ అధికంగా వినియోగిస్తూ సైబర్ వలలో పడకండి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో ఎస్సై అనిల్ రెడ్డి బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం విద్యాసంస్థల ముగుస్తున్న సమయంలో విద్యార్థులు ఇంటి వద్ద ఫోన్‌లకు అలవాటు పడి సైబర్ వలలో చిక్కకుండా ఉండడానికి పలు సూచనలను సలహాలను ఇచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించిన మెసేజ్లను కానీ ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని అలాంటి వాటిపై తగు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ వాటిలో చిక్కుకొని చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని విలువైన సమాచారంతోపాటు డబ్బులను పోగొట్టుకుంటున్నట్టు గుర్తుచేశారు. విద్యార్థులు ఫోన్ యూస్ చేయకుండా ఉండడానికి ప్రయత్నం చేయాలని తల్లిదండ్రులకు సూచంచారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిచిన్న ఎమ్మార్వో

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ లో బుధవారం ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సంఘం పరిధిలోని గ్రామాల రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించి, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచంచారు. గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2203 సాధారణ రకానికి 2183 రూపాయల ప్రభుత్వ మద్దతు ధర నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ మాలిక్, ఏఈఓ సాయి సచిన్, సంఘ కార్యదర్శి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధన్‌పాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ధన్ పాల్ లక్ష్మి భాయ్ విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత అంబలి పంపిణీ బుధవారం నగరంలోని పిఎంఎల్ఎస్ పెట్రోల్ బంక్ ఎదురుగ లలిత రైస్ హౌస్ ప్రాంగణంలో పార్శి రమేష్ షాప్‌లో ప్రారంభించారు. అంబలి పంపిణీ కేంద్రాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణం కాకుండా, చుట్టూ పక్కన గ్రామాల నుండి నగరానికి వచ్చేవారికి తన ట్రస్ట్ ద్వారా ఉచిత అంబలి వితరణ చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున వృద్దులు, చిన్న పిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంబలి లాంటి జవా తీసుకోవడం వల్ల ఎండదెబ్బ తగలకుండా ఉండొచ్చాని, తన ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటమని అన్నారు. ఈ కార్యక్రమంలో లలిత రైస్ హౌస్ యజమాని పర్శి రమేష్ గుప్తా, బీజేపీ నాయకులు ఇలందుల ప్రభాకర్ గుప్తా, శివునూరి భాస్కర్ గుప్తా, హరీష్ రెడ్డి, ఆనంద్, గిరిబాబు, పుట్ట విరేందర్, సాయి రామ్, శిలా శ్రీనివాస్, కోడూరు నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దుర్గా నగర్ కింది తాండలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో పండుగలు ప్రకృతి తో ఉంటాయనీ, తండా వసూలు ప్రకృతితో ఉంటారన్నారు. ఆలయానికి ప్రహరీ గోడ కోసం అవసరం అయిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు సురేష్ నాయక్, రాజ శేఖర్, హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన

బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

- జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు,
- జిల్లా ఆదివాసీ గిరిజన అధ్యక్షులు కేతావత్ యాదగిరి
- 7న గిరిజన బంజారా సమావేశం జయప్రదం చేయాలని పిలుపు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గిరిజనుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీలకు గిరిజనులు బుద్ధి చెప్పాలని, ఈ నెల 7న నిజామాబాద్ లో నిర్వహించే గిరిజన బంజారా సమావేశానికి గిరిజన ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు, జిల్లా ఆదివాసీ గిరిజన అధ్యక్షులు కేతావత్ యాదగిరి కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేతావత్ యాదగిరి మాట్లాడుతూ.. ఏప్రిల్ 7న నిజామాబాద్ జిల్లా కేంద్రాలలోనీ బృందావన్ గార్డెన్ లో నిజామాబాద్ జిల్లా పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో జిల్లా ఆది వాసీ గిరిజన సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డితో పాటు బంజారా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరుకా నున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చామో అదే విధంగా లోక్ సభ ఎన్నికల్లో జీవన్ రెడ్డికి మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి, తండాల నుంచి ప్రతి ఒక్క గిరిజనలు హాజరు కావాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఆదివాసీలు, లంబాడా సోదరులు అందరూ పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి బంజారా సేవ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షులు, రాంపూర్ పిఏసీఎస్ చైర్మన్ తారచంద్ మాట్లాడుతూ.. గిరిజన ఆదివాసీ అధ్వర్యంలో ఐదు నియోజక వర్గాల పరిధిలో అదివాసి గిరిజన సమావేశానికి విచ్చేసి మన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మద్దతు తెలపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసి గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై బంజరుల ఐక్యతను చాటాలన్నారు. బీజేపీ బీఆర్ఎస్ ఎన్నడూ కూడా బంజారాల సమస్యలపై పోరాడలేదని, ఏ ఒక్క తండాకు వెళ్లి మన బాధలు, గాథలు వినలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే మన సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షులు సుభాష్ జాదవ్, మల్కాపూర్ మాజీ సర్పంచ్ ప్రకాష్ నాయక్, రాజు, ఆదివాసీ వైస్ చైర్మన్ బాల్ రాజు నాయక్, ధర్పల్లి మండల అధ్యక్షుడు మంగ్యా నాయక్, రూరల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సురేష్ నాయక్, మోపాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రవీందర్, వినోద్, దాదు రావు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిని గెలిపిద్దాం

- దళిత వికాస సమితి పిలుపు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దళిత వికాస సమితి రూపొందించిన కరపత్రాన్ని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి గురువారం ప్రారంభించనున్నారని నిజామాబాద్ రూరల్ దళిత వికాస సమితి ఇన్చార్జి దాసరి గంగాధర్ బుధవారం తెలిపారు. దళిత వికాస సమితి నిజామాబాద్ పార్లమెంట్ నాయకులు మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి ని గెలిపించాలని దళిత వికాస సమితి రూపొందించిన కరపత్రాన్ని జీవన్ రెడ్డి జగిత్యాల లో వారి ఇంటి వద్ద గురువారం ఉదయం 8గంటలకు విడుదల చేయనున్నారని తెలిపారు. కావున దళిత వికాస సమితి నిజామాబాద్ పార్లమెంట్ ఇంచార్జి, నియోజకవర్గం ఇంచార్జి లు తప్పక హాజరు కావాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నర సిద్ధార్థ ఆదేశాల మేరకు అందరూ హాజరు కావాలని దాసరి గంగాధర్ కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

- గల్ఫ్ వలసలపై స్టడీ ప్రాజెక్టు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఐదుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీ పెద్దన్న తెలిపారు. మోర్తాడ్ మండలంలో గల్ఫ్ వలసలు అనే అంశంపై నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనిపించిన ఐదుగురు విద్యార్థులను రాష్ట్రస్థాయి స్టడీ ప్రాజెక్టుకు ఎంపికైనట్లు తెలిపారు. హైదరాబాద్ బేగంపేట్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ప్రదర్శన లో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు అంశాలపై ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై కళాశాల పేరును కొనియాడెందుకు కృషి చేసిన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రశంస పత్రాలతో అభినందించారు.

ధాన్యం సరిగా కొంటున్నారా.?

- కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్


రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

నవతెలంగాణ - మాక్లూర్

ఆలూరు మండలంలోని కల్లేడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ పరిశీలించారు. ధాన్యం సరిగా కొనుగోలు చేస్తున్నారా..? ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను ఆరా తీశారు. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాన్ని తీసుకురావాలని, ప్రభుత్వ ఇచ్చే గిట్టుబాటు ధరను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఒ శ్రీనివాస రావు, డిసిఏ పాపయ్య, ఆర్మూర్ క్లస్టర్ సత్యనారాయణ, మానిటర్ ఆఫీసర్ రవీందర్ సింగ్, సింగిల్ విండో చైర్మన్ బూర్రోల అశోక్, డైరెక్టర్ గంగారం, కార్యదర్శి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన అబ్దుల్ వహీద్ అలియాస్ అబ్దుల్ ఖురేషి (25)అనే యువకుడు చెడు వ్యసనాలకు బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్టు బోధన్ సీఐ వీరయ్య తెలిపారు. ఈ నెల1వ తేదీనా 100 స్తంభాల గుడి సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శవం కుళ్ళిపోయి ఉందని తెలిపారు. మృతుని సోదరి మెరూన్నీసా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన సొసైటీ డైరెక్టర్లు


కాంగ్రెస్ లో చేరిన నాయకులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని ముచ్కూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 9 మంది డైరెక్టర్లు బుధవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి సునీల్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో డైరెక్టర్లు బంగ్లా దేవేందర్, బంగ్లా లక్ష్మీ నరసింహ గౌడ్, బురెడ్డి గంగారెడ్డి,బురెడ్డి చిన్న రాజన్న, ఈదపు శ్రీనివాస్, కైరి లక్ష్మి, తెడ్డీ లావణ్య, బొమ్మెన సాయన్న, వద్యాల లక్ష్మణ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోధిరె స్వామి, జె జె నర్సయ్య, ముచ్కూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్, లింబాద్రి, కొరాడి రాజు, రాజేష్, నరేందర్ నేనావత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని పల్లికొండ, చెంగల్ గ్రామాలకు చెందిన బిజెపి, బిఆర్ఎస్ నాయకులు బుధవారం ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో గంగ సురేష్, రాజ్ కుమార్, హరీష్, అనిల్, వంశీ, గంగాధర్, బాలకిషన్, సురేష్, మోహన్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోధిరె స్వామి, కుంట రమేష్, జెజె నర్సయ్య, ఎంపీటీసీ కృష్ణ,రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు కుకునూరు పాఠశాల 50వ వార్షికోత్సవ సంబరాలు

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

వేల్పూర్ మండలంలోని కుకునూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 50వ వార్షికోత్సవ సంబరాలు నేడు నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ కు చెందిన ఏ జి లిటి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, విజయలక్ష్మి, మండల విద్యాధికారి వనజ రెడ్డి ,ఎస్సై వినయ్ కుమార్ తదితరులు హాజరవుతున్నట్టు తెలిపారు. అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మండలంలో ఘనంగా శివాజీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-ముప్కాల్

ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో యువజన సంఘల నాయకులు నివాళి అర్పించారు. ముప్కాల్ మండల కేంద్రంతో పాటు వేంపల్లి, రెంజర్ల, నాగంపేట్, కొత్తపల్లి, వెంచిర్యాల, నల్లూర్ గ్రామాలలో యువజన సంఘం నాయకులు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువజన సంఘల నాయకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూఢవీధుల్లో ఊరేగిన శ్రీనివాసుడు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు సాయంత్రం పూర్ణాహుతి తరువాత అశ్వవాహనంపై మాడ వీధుల్లో శ్రీనివాసుడి ప్రతిమల ఊరేగింపు నిర్వహించారు. ఆళ్వారుల్లో చివరి ఆళ్వారు అయిన తిరుమంగై ఆళ్వారు జీవిత చరిత్రను దోపోత్సవంగా ప్రదర్శించారు. గ్రామానికి చెందిన ఆడబిడ్డలు మంగళ హారతులతో స్వామి వారిని ఆహ్వానించారు. గ్రామ యువత ఆట పాటలతో అశ్వవాహన ఊరేగింపులో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలు దేవనాథ స్వామి మంగళా శాసనాలతో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త నరసింహ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆచార్య గంగోత్రి రామానుజ దాస్ స్వామి. ధర్మకర్తలు నర్సింహారెడ్డి, శిరీష్, విజయసింహా రెడ్డి, సిని నటులు రవి,సాయ రెడ్డి, నరాల సుధాకర్ రవీందర్ యాదవ్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

బాధితునికి మొబైల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో బాధితునికి మొబైల్ ఫోన్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీపేట్ మండలంలోని మందాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి హరీష్ గత కొన్ని నెలల క్రితం తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ట్రేస్ చేసి స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి మొబైల్ ఫోన్‌ను రికవరీ చేసి అతనికి అందజేశామని తెలిపారు.



సెల్‌ఫోన్ అందజేత

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

నవతెలంగాణ-పిట్లం

ధాన్యంను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి లబ్ధి పొందాలని ఏఈఓ ప్రదీప్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మానగర్ మార్దండ గ్రామాలలో వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలము శ్రమించి పండించిన వరి ధాన్యమును దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వము కల్పించిన మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యమునకు 2203 , కాగా బి గ్రేడ్ ధాన్యమునకు 2183 రూపాయలు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో అశోక్ గౌడ్ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.



అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జీవన్ రెడ్డి పేరును ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్తేజం మొదలైందని, అదేవిధంగా గత పది సంవత్సరాలుగా కవిత, అరవింద్‌లను ఎంపీగా గెలిపించడం ద్వారా నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోయిందని అన్నారు. అనుభవం లేని వారిని గెలిపించుకోవడం ద్వారా పార్లమెంట్ స్థితిగతులు పూర్తిగా మారిపోయాయని దీనిని జిల్లా ప్రజలు గమనించారని తెలిపారు.


మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

కల్వకుంట్ల కవిత, అరవింద్ లను గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధిలో ముందుకు వెళ్లాల్సిన నిజామాబాద్ నియోజకవర్గ పూర్తిగా వెనుకబడిపోయిందని, వీరిద్దరిలో ఒకరు తమ వ్యాపారాల కోసం మరొకరు ప్రచారం కోసం మాత్రమే పని చేశారని ప్రజల సమస్యలను పక్కన పెట్టారని మానాల మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చిందని అందులో ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం గాని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గాని ,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీని 10 లక్షల వరకు పెంచడం ,ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల కొరకు ఐదు లక్షల రూపాయలు, ఎస్సీ ఎస్టీలకు ఇండ్ల నిర్మాణం కొరకు ఆరు లక్షల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఇన్ని అభివృద్ధి పనుల వల్ల బిజెపి, బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని అన్నారు .ఎలక్షన్లకు ముందు షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పిన కవిత తెరిపించలేదని, అదేవిధంగా పసుపు బోర్డు తీసుకువస్తానని బాండ్ పేపర్ రాసి ఇచ్చిన అరవింద్ ఒక అబద్ధపు జీవోను తీసుకువచ్చారని, ప్రభుత్వం జీవోను విడుదల చేస్తే పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నాం దాని విధివిధానాలను రూపొందించి స్పష్టత ఇస్తుందని కానీ అలాంటిదేవీ లేకుండా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ఇక్కడి ప్రజలను మోసం చేశారన్నారు. పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తారా లేక గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఏర్పాటు చేస్తార అనే స్పష్టత అరవింద్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కావున నియోజకవర్గ ప్రజలు సరైన ఆలోచనతో అనుభవాగ్నులైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొదిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జయ జయ నరసయ్య, నియోజకవర్గ యూత్ ఇంచార్జి నాగేంద్ర,జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ వాకా మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంత రావు, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, దేశాయి కల్పన, వెంకమ్మ గంగ మని,యూత్ టౌన్ ప్రెసిడెంట్ మహేష్,యూత్ జిల్లా కార్యదర్శి చరణ్,సురేష్ సతీష్, రవి, ఎన్ ఎస్ యు ఐ జిల్లా కార్యదర్శి రెహమాన్, బుర్రన్న నారాయణ, శ్యామ్ రాజ్, లక్ష్మణ్, పృథ్వీరాజ్, శివగంగాధర్, బాలయ్య, జెసిబి రాజన్న, మొదలగు వారు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు


దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కురుమలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య 97వ జయంతి వేడుకలను కురుమ యువ చైతన్య కమిటీ, మండల కాంగ్రెస్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ కురుమ మాట్లాడుతూ ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుండి విముక్తి కోసం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేఖంగా సాగిన పోరాటంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ యువకుడు ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లింగంపేట్ మండల గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం చైర్మన్ మొకిరె భైరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మండల యూత్ అధ్యక్షులు సుప్పాల రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లమయ్య, నయీం, కౌడ రవి, మామిడి సంగయ్య, సూర్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్, లైంగికదాడికి యత్నించిన వ్యక్తి మూడేండ్ల జైలుశిక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి యత్నించిన నిందితుడికి మూడేండ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జ్ పి ఓ సి ఎస్ ఓ యాక్ట్ కోర్టు కామారెడ్డి)లో బుధవారం తీర్పునిచ్చారు.

రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన పూసల కనకయ్య (55) 2022వ సంవత్సరంలో ఒక చిన్న పాపని కిడ్నాప్ చేసి, లైంగికదాడికి యత్నించాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్టు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి సకాలంలో శిక్ష పడేలా కృషి చేసిన పిపి శేషుని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నరేష్ ఇన్స్పెక్టర్‌ని, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎస్ విజయ్ కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

7న మోడల్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్

- ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లు

నవతెలంగాణ-సదాశివనగర్

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 7న పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలని సూచించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఈనెల 7వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఇదివరకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆరవ తరగతి విద్యార్థులకు ఆదివారం ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకు ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తరగతి నుంచి 10 వరకు మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://Telangana Ms.cgg.gov.in లింకు ద్వారా హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

దొడ్డికొమురయ్య జయంతి వేడుకలు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 97వ జయంతి వేడుకలను మండలంలో బుధవారం మండలంలోని గొల్లపల్లి మండల కురుమ సంఘం అధ్యక్షులు పాల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతంలో పేద కురుమ కుటుంబంలో జన్మించి, ఆనాడు జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పేద ప్రజలను హింసిస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు కే శివరాజు, ఆర్ వీరయ్య, రెడ్డి మల్లేష్, కే నరేష్, జే సుమన్, జే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అరుణతారను కలిసిన గంగారాం

నవతెలంగాణ-బిచ్కుంద

బిజెపి జిల్లా అధ్యక్షురాలు అరుణతారను బిచ్కుంద మండల కేంద్రంలోని అరుణతార నివాసంలో ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మంగళవారం సౌధాగర్ గంగారం బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్ చూగ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకుని బిజెపి పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షురాలు అరుణతార గంగారాంను శాలువాతో సన్మానించి పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బి బి పాటిల్ గెలుపులకు కృషి చేయాలని ఈ సందర్భంగా అన్నారు. వారి వెంట నాయకులు మంచి సిద్ధిరాములు, సుభాష్ జాదవ్ ఉన్నారు.

సజ్జ పంట పరిశీలించిన వ్యసాయాధికారి

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని పచ్చల్ నడుకుడ గ్రామంలో సజ్జ పంటను మండల వ్యసాయాధికారి నరసయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు 200 ఎకరలో సాగు చేశారు. సజ్జ పంటలో కత్తెర పురుగు ఉధృతి వున్నదని అన్నారు. సజ్జ పంట ప్రస్తుతం 45-55 రోజుల కంకి ఏర్పడు దశలో ఉన్నదని, శాఖియ దశలో ఎకరనికి 10-12 లింగ ఆకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీనిలో మగ పురుగులు ఆకర్షించబడి బుట్టలో పడుతాయని, రైతులు వాటిని చంపేయాలన్నారు. క్లోరం త్రనిలి ప్రోల్ 0.4 ఎంఎల్ లేదా 0.5 ఎంఎల్ సైనా టోరమ్ లీటర్ నీటికి కలిపి పిచకారీ చేసుకోవాలని సూచించారు. పురుగు ఉధ్రుతిని బట్టి వారం తర్వాత 0.25 ఎంఎల్ తయోమీతక్సిన్, లామ్డసై హలోత్రిన్ లీటర్ నీటికి కలిపి పంట సుడిలో పడే విధంగా పిచికారి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వినయ్, రైతులు పాల్గొన్నారు.


పంటలు పరిశీలిస్తున్న అధికారులు

పారదర్శకంగా ర్యాండమైజేషన్

- కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ పూర్తి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

త్వరలో జరిగే లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ నిర్వహించారు.రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, ఎల్లారెడ్డి ,కామారెడ్డి, జుక్కల్ సెగ్మెంట్ లకు కేటాయించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్ ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కేంద్ర ఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, నరేందర్, ఖాసీం అలీ, మదన్ లాల్, శ్రీకాంత్ ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, ఇంద్ర ప్రియదర్శిని, ఉమలత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సారా సురేష్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద కూలీలకు కనీసం రెండు వందల రోజుల పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సారా సురేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతోని జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. మండుటెండలో కూలీలు పనిచేస్తున్న ప్రదేశంలో టెంటు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా ప్రతి వారం కూలీలకు డబ్బులు చెల్లించాలని, కొలుతలతోని పని లేకుండా రోజు కూలి రూ.380 ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కోతలు విధించడాన్ని వ్యతిరేకించాలన్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించాల్సింది పోయి ప్రతి సంవత్సరం బడ్జెట్లో ఉపాధి హామీ నిధుల్లో కోత విధిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఏదైతే హామీలు ఇచ్చిందో హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్లో కోత విధిస్తూ కార్మికుల అన్యాయం చేస్తున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాల్ని ఎండగట్టారు. ఈ సమావేశంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి బి.అశోక్, వి.సత్యక్క, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సాగర్, అనిల్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేశ్

తూతూ మంత్రంగా పనులు



- పర్యవేక్షణ లేని పంచాయతీ అధికారులు
- దొడ్డు రకం ఇసుక మట్టితో నిర్మాణం

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి రూ.20 లక్షల నిధులతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్ ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హయంలో మంజూరు అయింది. దీని నిర్మాణానికి సుమారు మూడు సంవత్సరాల కాల వ్యవధి పట్టింది.

ఇసుక మట్టితో నేల రాయి నిర్మాణం

కమిటీ హాల్ నిర్మాణం పనులు కింద మీద పడి పూర్తి చేసుకున్నప్పటికీ నిధులు మంజరై కాంట్రాక్టు చేతిలో పడడంతో మళ్లీ పనులను కొనసాగిస్తున్నారు. కమిటీ హాల్ లోపల నేల రాయి పరవలసి ఉంది? దానిని మొదటగా నేలను సమాన లెవెల్‌లో చేసి తదుపరి మంచి నాసిరకమైన ఇసుక, సిమెంట్ కలిపి నెల రాయి పర్చాలి. కాంట్రాక్టర్ల దొడ్డు రకం ఇసుక మట్టితో నేల రాయిని పర్చటం ఎక్కువ రోజులు కాదు కదా. ఒక నెల కూడా ఉండే పరిస్థితి లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ మొదటి నుంచి ఇలాగే నిర్మాణంలో నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నప్పటికీ పంచాయతీ శాఖ అధికారులు మాత్రం పర్యవేక్షణ లేకుండా పోయిందని దీనితో నిర్మాణం ఎలా జరుగుతుంది. ఇసుక ఎంత వేయాలి సిమెంట్ ఎంత వేయాలి అనేదానిపై కాంట్రాక్టర్‌ను అడిగే అధికారి లేకపోవడం నిర్మాణంలో ఆస్కారకం బాగా ఉందని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. కాంట్రాక్టర్ తనకు ఇష్టం వచ్చిన మట్టి ఇసుకను దొడ్డు దొడ్డు కంకర తీసుకుని వచ్చి చేతులు దులుపుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని తూతూ మంత్రంగా పనులు చేపట్ట కుండా, ఇప్పుడు చేసే పనిలో నాసికరకం పనులతో నేలరాయిని మంచిగా వేసేలా చూడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బస్టాండ్ రోడ్డు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ టీఎస్ ఆర్టీసి బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. మలుపు ఉండడంతో వచ్చిపోయే వాహనాలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. గతంలో మురుగు నీరు బస్టాండ్ ఆవరణలోకి చేరి తీవ్ర ఇబ్బందులు పడగా అధికారులు తాత్కాలిక మరమ్మత్తు పనులు చేశారు. బండ రాళ్లు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన బస్సులు వెళ్లే రోడ్డు

పాఠశాల చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ ఎంపి యూపిఎస్ పాఠశాల చైర్మన్ లక్షెట్టి లక్ష్మీబాయిని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘణంగా సన్మానించారని హెచ్ఎంపీ నవీన్‌కూమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వచ్చిన అతిథులకు సన్మానాలు, సత్కరించి, జ్ఞపికలు అందచేశారు. నూతనంగా ఎన్నికైన పాఠశాల చైర్మన్ లక్ష్మీను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్షెట్టి సాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు


చైర్మన్ దంపతులకు సన్మానం

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-కామారెడ్డి

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని, చట్ట ప్రకారం నేరం అని అంగన్‌వాడీలు సూచించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్యవివాహాలు దాని వల్ల కలిగే నష్టాలపై గ్రామంలో ని ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ పర్యవేక్షకురాలు పద్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన నష్టాలను వివరించారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని, చిన్న వయసులో వారి పెళ్లి చేసి భవిష్యత్తు నాశనం చేయవద్దు అని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు వెంకటలక్ష్మి, మంగ, పద్మ, అనసూయ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సజ్జ పంట పరిశీలన


సజ్జ పంట పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న సజ్జ పంటను జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, భీంగల్ ఏడిఏ మల్లయ్య బుధవారం పరిశీలించారు. సజ్జ పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పురుగు ఉధృతి వల్ల రైతులకు అధిక పంట నష్టం అయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలను ఆయన రైతులకు సూచించారు. ముఖ్యంగా రైతులు పంటలో కత్తెర పురుగు యొక్క లార్వాల దశలను బట్టి వివిధ మందులను పిచికారి చేయాలన్నారు. మొదటి దశలో ఆకులపైన తల్లి పురుగు గుడ్లను, మొదటి దశ లార్వలను 1500 పీపీఎం వేపనూనె 5 మిల్లీలీటర్లు, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా నివారించుకోవచ్చు అన్నారు. రెండు, మూడవ దశలోని లార్వలను నివారించడానికి రసాయనిక మందులైన స్పెనటోరమ్ 0.5మిల్లీమీటర్లు (లేదా) క్లోరన్త్రిపోల్ 0.4 మిల్లీలీటర్లు, లీటర్ నీటికి 1500 పీపీఎం వేపనూనె కలిపి మందును మొక్క సుడులలో పడేటట్లు ఉదయం లేదా సాయంత్రం వేళలో పిచికారి చేసినట్లయితే పురుగును నివారించవచ్చని తెలిపారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారిని బద్దం లావణ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు.

వాహనాల విస్తృత తనిఖీ


వాహనాల తనిఖీ చేపడుతున్న పోలీసులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో ఫ్లైయింగ్ స్కాడ్ బాలకిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు బుధవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమంగా డబ్బులు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాలకిషన్ తెలిపారు. రూ.50 వేల కంటే నగదు ఎక్కువగా ఉంటే ఆధారాలు చూపాలని తెలిపారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది సదానందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

హుండీ దొంగల రిమాండ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి పియస్ పరిధిలో 1వ తేదీనా పడ్కల్ గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండిని దొంగిలించుకు పోయిన విషయంలో బుధవారం ఇద్దరు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వారి వద్ద నుండి హుండీ నుండి దొంగిలించిన నగదు 74,500 దొంగతనం కోసం ఉపయోగించిన బైక్ ను స్వాదీన చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టుతెలిపారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

గోదావరిలో పడి పశువుల కాపరి మృతి

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం తాడి బిలోలి ఘాట్ సమీపంలో గోదావరిలో పడి పశువుల కాపరి నాయక్ పోడ్ సాయికుమార్ (21) మృతిచెందినట్టు రెంజల్ ఎస్సై ఈ. సాయన్న తెలిపారు. ఈనెల 2న పశువులను గోదావరి ఒడ్డున తీసుకెళ్లగా గేదెలు నీటిలో వెళ్లడంతో వాటిని తీసుకురావడానికి సాయికుమార్ వెళ్లాడు. ఆయనకు ఈత రాకపోవడంతో గోదావరిలో నీటమునిగి మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోదన్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

పీహెచ్‌సీ.. ప్రథమ చికిత్సకే పరిమితం

- అత్యవసర సమయాల్లో అందని చికిత్స
- రోగులు ఎక్కువ.. వసతులు తక్కువ
- భిక్కనూరులో సీహెచ్‌సీ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచిత నాణ్యమైన వైద్యం అందుతుందని, అత్యవసర సమయంలో వైద్యులు సేవలు అందించి ప్రజల ప్రాణాలు కాపాడడంలో ముందుంటారని ప్రతి ఒక్కరూ ఎలాంటి ఆపద వచ్చినా స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్తుంటారు. రోగులకు సరిపడా వసతులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. భిక్కనూర్‌లో ఉన్న పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని మండల వాసులు కోరుతున్నారు.


భిక్కనూర్ పీహెచ్‌సీ

భిక్కనూర్ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 14 గ్రామపంచాయతీలు మాత్రమే భిక్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోకి వస్తాయి. పట్టణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు ప్రభుత్వ ఆసుపత్రికి వందల సంఖ్యలో చికిత్స నిమిత్తం రోగులు వస్తుంటారు. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్థానిక కెమికల్ కంపెనీలు, కోళ్ల ఫారాలు, ఇతర ప్రాంతాల నుండి వచ్చి జీవిస్తూ పని చేస్తున్న వలస కార్మికులు అలాగే పట్టణానికి 44వ జాతీయ రహదారి ఆనుకొని ఉన్న కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు చికిత్స కొరకు ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారు.

భిక్కనూరు ప్రభుత్వ ఆసుపత్రి 3 ఎకరాలలో విస్తీర్ణ వైశాల్యంలో 6 పడకల ప్రాథమిక చికిత్స కేంద్రం అలాగే 24 గంటల ప్రసూతి కేంద్రాన్ని నిర్మించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 3 మెడికల్ అధికారులు, 2 స్టాఫ్ నర్స్, 1 పిహెచ్‌ఎన్, 1 హెచ్ ఇవో, 2 సూపర్వైజర్లు, 1 ల్యాబ్ టెక్నీషియన్, 10 ఏఎన్ఎం, 41 ఆశావర్కర్లు, 2 అటెండర్లు, 1 డిఈఓ, 1 డ్రైవర్, ఇతర సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంతంపల్లి, లక్ష్మీ దేవునిపల్లి, రామేశ్వర్‌పల్లి, భిక్కనూర్, సిద్ద రామేశ్వరనగర్, బస్వాపూర్, గుర్జకుంటా, ర్యాగట్లపల్లి, వలస కార్మికులు, కంపెనీలలో పని చేస్తున్న కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు.

అత్యవసర చికిత్సకు కామారెడ్డి పయనం..

భిక్కనూర్ ప్రభుత్వ ఆసుపత్రి విశాలమైన ప్రాంగణమున్న, మెరుగైన చికిత్సలు అందిస్తున్న అత్యవసర సమయంలో మాత్రం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం ప్రథమ చికిత్స నిర్వహించడం, నార్మల్ డెలివరీలు, రక్త పరీక్షలు చేయడం వంటి చిన్న చిన్న చికిత్సలు నిర్వహిస్తారే తప్ప ఎలాంటి అత్యవసరం వచ్చిన కామారెడ్డి వెళ్లాల్సి వస్తుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

భిక్కనూరు పీహెచ్‌సీలో సరిపోని పడకలు...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు వందల సంఖ్యలో చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్న పడకలు సరిపోకపోవడం కారణంగా ప్రాథమిక చికిత్స నిర్వహించి పంపిస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో కేవలం 6 పడకలు మాత్రమే ఉన్న కారణంగా అత్యవసర సేవలు, గ్లూకోజ్ వంటి చికిత్సలు నిర్వహించలేకపోతున్నారు. నార్మల్ డెలివరీ చేసిన సమయంలో పడకలు సరిపోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 50 పడకల ఆసుపత్రి నిర్మిస్తే మెరుగైన చికిత్స రోగులకు అందే అవకాశం ఉంది.

6 గ్రామాల ప్రజలకు అందని ప్రభుత్వ వైద్యం..

పట్టణ కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థానికంగా ఉన్న చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు వచ్చి వైద్యం చేసుకుంటారే తప్ప సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచర్ల, పెద్దమల్లారెడ్డి, భాగిర్థిపల్లి, ఇసన్నపల్లి, అయ్యవారిపల్లి, మల్లుపల్లి, తండా ప్రజలు చికిత్స నిమిత్తం పట్టణ కేంద్రానికి వచ్చి వైద్యం చేసుకుని అవకాశం లేని కారణంగా సమీపంలో ఉన్న మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నారు. పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తే చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు సరైన సమయంలో వైద్యం అందే అవకాశం ఉందని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సిహెచ్‌సి సెంటర్ ఏర్పాటు చేస్తే అందుబాటులోనే అత్యవసర వైద్య సేవలు..

44వ జాతీయ రహదారి ప్రక్కన భిక్కనూరు పట్టణం ఉన్న కారణంగా జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరగడం చుట్టుప్రక్కల కెమికల్ కంపెనీలు, కోళ్ల ఉన్నందున వలస కార్మికులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి భిక్కనూర్ పట్టణ సమీపంలో నివసిస్తున్నారు. ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్యం అందుబాటులో ఉన్న అత్యవసర చికిత్సలకు మాత్రం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్ళవలసి వస్తుంది. సిహెచ్‌సి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అత్యవసర సమయంలో కామారెడ్డి వెళ్లకుండా అందుబాటులోనే 24గంటలు అందుబాటులో ఉండే వైద్యులు, స్కానింగ్, చిన్నపిల్లల వైద్యులు ఏరియా ఆసుపత్రిలో ఉండే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిని సిహెచ్‌సి సెంటర్‌గా మార్చాలని మండల ప్రజలు కోరుచున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్యం, అత్యవసర వైద్య సేవలు ప్రభుత్వం అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. జాతీయ రహదారి ప్రక్కన భిక్కనూరు పట్టణం ఉన్న కారణంగా అత్యవసర సమయంలో వైద్య సేవల కోసం ప్రాణాలను రక్షించడానికి 20 కిలోమీటర్ల దూరం కామారెడ్డి పట్టణానికి వెళ్లాల్సి వస్తుంది. అన్ని రకాల వసతులు ఉన్న భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిహెచ్ సెంటర్‌గా మార్చాలని, ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని బిక్కనూరు పట్టణంలో ఉన్న పీహెచ్సీ సెంటర్‌ని సిహెచ్‌సి సెంటర్‌గా మార్చాలని మండల ప్రజలు కోరుచున్నారు.

కళశాలల అభివృద్ధికి తోడ్పడతా

డీఐఈవో రవికుమార్


నూతన డీఐఈవో రవికుమార్‌ను సన్మానిస్తున్న పలువురు ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అందరిని కలుపుకొని కళాశాలల అభివృద్ధికి తోడ్పడతానని డిఐఈఓ రవికుమార్ హామి ఇచ్చారు. తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిజీఎల్ఏ) ముఖ్య సభ్యులు అందరుకలిసి డిఐఈఓ గా నూతన బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ కు డిఐఈఓ కార్యాలయం లో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు మామిడి విఠల్, ప్రధాన కార్యదర్శి జీ. శ్రీనివాస్ మాట్లాడుతు జిల్లాలోని కళాశాలల అభివృద్ధికి తోడ్పడాలని, అధ్యాపకుల అందరిని, తమ సొంత కుటుంబంలా చుసుకోవాలని, కళాశాలలో ఎలాంటి సమస్యలు అయిన వెంటనే సానుకులంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. డిఐఈఓ రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కళాశాలల అభివృద్ధి కి తోడ్పడాలని, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతూ మెరుగైన విద్యను అందించాలని సూచించారు. కళాశాలల మౌలిక వసతుల కారకు బోర్డ్ వారు ప్రభుత్వం చే నిధులను సాంక్షన్ చేయించిందని తెలిపారు. అందరిని కలుపుకొని కళశాలల అభివృద్ధికి తోడ్పడతానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు లెక్చరర్స్ పాల్గొన్నారు.

కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నాం

నవతెలంగాణ-ఆర్మూర్

సీనియర్ సిటిజన్స్ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నామని, ఫోరంలు గ్రామ గ్రామాన విస్తరించాలని విశ్రాంత అధ్యక్షులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘంలో బుధవారం సీనియర్ సిటిజన్స్ ఫోరం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరంతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు కోమన్పల్లి, ఇస్సాపల్లి, మామిడిపల్లి గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు. సభా కార్యక్రమా నికి దోండి నారాయణ వర్మ సభాధ్యక్షత వహించగా గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి

వృథాగా చెత్త రిక్షాలు


మూలకు పడ్డ చెత్తసేకరించే రిక్షాలు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలో ప్రతి రోజు ఉదయం ప్రతి ఇంటి నుంచి చెత్తను రిక్షా బండ్ల ద్వారా సేకరించె చెత్త సేకరణ బండ్లను అంగడి బజారులో వృథాగా పడేశారు. అవసరం ఉన్న బండ్లను మాత్రమే వాడుకొని మిగతా బండ్లను వృథాగా పడేయడంతో తుప్పు పట్టి పాడైపోయాయి. వృథాగా పడేసిన చెత్త రిక్షాలు ఉపయోగంలోకి తీసుకువస్తే చెత్త సేకరణకు ఉపయోగ పడడమే కాకుండా ప్రస్తుతం వాడకంలో ఉన్న చెత్త రిక్షాలు పాడైపోయిన సమయంలో ఉపయోగపడతాయి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే చెత్త రిక్షాలను వృథాగా పడేయకుండా ఉపయోగంలోకి తీసుకువచ్చి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని పట్టణ ప్రజలు కోరుచున్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

- అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్

రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో ఏ గ్రేడ్‌కు రూ.2203, బి గ్రేడ్‌కు రూ.2183 చెల్లిస్తుందన్నారు. 17 శాతంలోపు తేమశాతం ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మల్లికార్జున్ బాబు, డీఎం నిత్యానందం, డిటి ఎర్రం కిష్టయ్య, క్లస్టర్ ఆఫీసర్ రమేష్, మానిటరింగ్ ఆఫీసర్ సురేష్, అగ్రికల్చర్ ఏఈఓ రవి, సొసైటీ సెక్రటరీ మోహన్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో క్రమశిక్షణ తప్పనిసరి

- జిల్లా శిక్షణ కేంద్రంలో 255 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ
- శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవ్వాలి
- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లు శిక్షణ సమయంలో క్రమశిక్షణతో ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఆరు జిల్లాల నుంచి గత నెల ఆదిలాబాద్ జిల్లా శిక్షణ కేంద్రానికి విచ్చేసిన 255 మంది శిక్షణ కానిస్టేబుళ్ల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని, శిక్షణ స్వీకరిస్తున్న స్టైఫండరి కానిస్టేబుళ్లను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని శిక్షణ కేంద్రాల్లో ఒకే రకమైన శిక్షణ అందిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ద్వారా అత్యంత ఉన్నతమైన సౌకర్యాలను కల్పిస్తూ శిక్షణను అందించడం జరుగుతుందని తెలిపారు. 9 నెలల పాటు జరిగే ఈ శిక్షణలో ఇండోర్ ఔట్ డోర్ విభాగాలను శిక్షణను అందిస్తారని తెలిపారు. శిక్షణలో భాగంగా ఫిజికల్ ట్రైనింగ్, స్వాడ్ డ్రిల్, ఆమ్స్ డ్రిల్, లాటి డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, ఫైరింగ్ ప్రాక్టీస్, యోగ, అదేవిధంగా సీఆర్ పీసీ, ఐపీసీ, ఇన్వెస్టిగేషన్, నేరస్తులు ఉపయో గిస్తున్న నూతన పద్ధతులను నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. సమాజంలో పోలీసులకు ఉన్నత స్థానం కలిగి ఉందని దాన్ని ఎల్లవేళలా కాపాడుతూ ఉండాలని, ఉద్యోగం నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ తప్పనిసరి అని సూచించారు. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్లకు రూ.13వేల 500 స్టైఫండ్‌ను అందిస్తున్నట్లు తెలియజేశారు. పోలీసు ఉద్యోగం అనేది ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగమని తెలియజేశారు.

ఏకాగ్రతతో ఉంటూ ప్రతిఒక్క అంశాన్ని తెలుసుకోవాలి...

శిక్షణ సమయంలో ఏకాగ్రతతో ఉంటూ ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం సమాజంలో నేరాలను తగ్గుముఖం చేయడమే ప్రధాన కర్తవ్యంగా విధుల నిర్వర్తించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు, ఆర్థిక నేరగాళ్లు, సంఘవిద్రోహశక్తులు, వివిధ రకాలైన నేరగాళ్లతో ఉద్యోగం నిర్వహించాల్సి వస్తుందని, దీనికి దీటుగా శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారవ్వాలని సూచించారు. ఉద్యోగంలో ప్రతి ఒక్క సిబ్బంది నిత్య విద్యార్థిగా ఉంటూ, నూతన నేరాలను కనుగొంటూ, వాటిని చేదించే దిశగా శిక్షణను అందించనున్నట్లు తెలియజేశారు. జిల్లా ఎస్పీ స్వయంగా తన శిక్షణ సమయంలో తెలుసుకున్న విషయాలను శిక్షణ కానిస్టేబుళ్లకు తెలియజేశారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా పోలీసులు ముందుండి సమాజానికి దారి చూపించే విధంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం శిక్షణ కేంద్రంలో తిరిగి కానిస్టేబుళ్లకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సి.సమైజాన్‌రావు, డీఎస్పీ బి.ప్రకాష్, సీఐ ఎన్ఎస్ ప్రసాద్, ఆర్ఐ డి.కార్తీక్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం.. ప్రచారానికి ఆటంకం

- ఉమ్మడి జిల్లాలో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఎండవేడిమికి అభ్యర్థులు.. కార్యకర్తల ఉక్కిరిబిక్కిరి
- మండల స్థాయికే పరిమితమైన ప్రచారపర్వం
- ముంచుకొస్తున్న పోలింగ్ సమయం.. పార్టీల్లో టెన్షన్

ఒక పక్క భానుడి భగభగలు..మరోపక్క లోక్‌సభ ఎన్నికల ప్రచారం.. ఉమ్మడి జిల్లా రాజకీయాలను మరింత హీటెక్కిస్తోంది. ప్రస్తుతం ఎండలు మండిపోవడంతో అభ్యర్థులు.. ఆయా పార్టీల్లో టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. ఉదయం వేళలోనే కాలు బయటపెట్టలేని పరిస్థితి ఉండటంతో ప్రచార పర్వంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం..ఎండవేడిమి తట్టుకోలేక మనుషులు..పశుపక్ష్యాదులు అల్లాడిపోతుండటం సమస్యను తీవ్రతను తెలియజేస్తోంది. ఈ తరుణంలో పల్లెల్లో ప్రచారం చేసేందుకు అభ్యర్థులు వెనుకడుగు వేస్తున్నారు. ప్రచారంలో అభ్యర్థుల వెంట వెళ్లే కీలక నాయకులు, కార్యకర్తలు సైతం ఎండ తీవ్రత కారణంగా వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. పోలింగ్‌కు మరో నెల పది రోజుల పాటు సమయం ఉండటం.. ఎండల తీవ్రత రోజురోజుకు అధికం కావడం చూస్తుంటే గడువులోపు ఏడు నియోజకవర్గాలు చుట్టిరావడం అభ్యర్థులకు సవాల్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


భానుడి ప్రతాపంతో జనసంచారం ఎక్కువగా లేక నిర్మానుష్యంగా మారిన వినాయక్‌నగర్ రోడ్డు

నవతెలంగాణ- నిజామాబాద్

ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ సమరం రసవత్తరంగా మారుతోంది. ఆయా ప్రధాన పార్టీలు ఇది వరకే అభ్యర్థులను ప్రకటించాయి. లోక్‌సభ సీటును దక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజామాబాద్ స్థానంలో కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ నుంచి అరవింద్ బరిలో నిలవనున్నారు. దీంతో పాటు జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి సురేశ్ షెట్కార్, బీజేపీ నుంచి బీబీపాటిల్, బీఆర్ఎస్ నుంచి అనిల్‌కుమార్‌కు ఆయా పార్టీలు అభ్యర్థులుగా ప్రకటించారు. రెండు స్థానాల్లో సైతం ఈ మూడు పార్టీలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఈ క్రమంలో ఎండల తీవ్రత ఆయా పార్టీలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం పార్టీల ఆందోళనకు కారణమవుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి..వడగాల్పుల కారణంగా బయటకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఆయా పార్టీల అభ్యర్థులు మండల కేంద్రాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తూ కుల సంఘాల పెద్దలను కలుస్తూ తమకు మద్దతునివ్వాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. లోక్‌సభ పరిధిలో ఏకంగా ఏడు నియోజకవర్గాలు ఉండటం వాటి పరిధిలో వందలాది గ్రామాలు ఉన్నాయి. ఈ నెలన్నర సమయంలో ఆయా గ్రామాలన్నింటిలో ప్రచారం నిర్వహించడం అభ్యర్థులకు కష్టతరంగా మారుతోంది. అభ్యర్థులతో పాటు వారి వెంట వెళ్తున్న కార్యకర్తలు, అనుచరులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ పార్టీల్లో టెన్షన్..!

ఈ వేసవిలో ఎండల తీవ్రత ఏప్రిల్ మొదటి వారంలోనే 43డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనుందనే సమాచారంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, శ్రేణుల్లో మరింత భయాందోళన రేకెత్తిస్తోంది. ఎన్నికల సమయం తక్కువగా ఉండటం..ఎండలు మండిపోవడంతో ఏడు నియోజకవర్గాల్లోని గ్రామాలన్నింటిలో ప్రచారం నిర్వహించడం సాధ్యమవుతుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రానున్న రోజుల్లో ప్రచారం నిమిత్తం ఆయా పార్టీల ముఖ్య నాయకుల సభల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎండల తీవ్రత దృష్ట్యా ఈ సభలకు జనాన్ని తరలించడం కూడా ఆయా పార్టీల అభ్యర్థులకు సవాల్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రానున్న పక్షం రోజుల తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుండగా.. అదే స్థాయిలో ఎండల తీవ్రత కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భావిస్తున్న రాజకీయ పార్టీలకు తాజా ఎండల తీవ్రత ప్రచారంపై ప్రభావం చూపిస్తుందని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు.

పెరగనున్న ఉష్ణోగ్రతలు..!

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగింది. గతేడాది ఇదే సమయాని కంటే రెండు డిగ్రీల ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదు అవడం గమనార్హం. ప్రతి ఏటా మే నెలలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ప్రభావం చూపించడం కారణంగా జనం సైతం తట్టుకోలేకపోతున్నారు. మనుషులే కాకుండా పశుపక్ష్యాదులు సైతం అల్లాడిపోతున్నాయి. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు ఇంటి నుంచి కాలు బయటపెట్టలేకపోతున్నారు. ఎక్కువ మంది సాయంత్రం వేళలోనే బయటకు వస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అధికారులు చెబుతుండటంతో వీటి బారిన పడకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడమే ఉత్తమమైన మార్గమని అనేక మంది భావిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్న అయినటువంటి మాజీ సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలకు బుధవారం రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి పరామర్శించారు. ప్రాగాడ సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ గౌడ్,ముప్పు గంగారెడ్డి,అర్రానోళ్ల శ్రీనివాస్,పుప్పాల సుభాష్,ఏలేటి సంతోష్ రెడ్డి,చెలిమెల రాములు,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో సంఘ భవనం, గ్రామపంచాయతీ ఆవరణలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య పోరాట పటిమను జిల్లా ఉపాధ్యక్షులు స్వామి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు భూపాల్, ప్రచార కార్యదర్శి రవి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, కురుమ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వీరుల పోరాటాలు దేశవాసుల్లో స్ఫూర్తిని నింపేవిగా ఉన్నాయని, వారిని ఆదర్శంగా తీసుకొని యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాం మోహన్ రెడ్డి, తెలంగాణ యునివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం కొ ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిందర్ రెడ్డి అన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్ఎస్ రిజనల్ డైరెక్టరేట్ హైదరాబాద్, తెలంగాణ యునివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నిజామాబాద్‌లో షహీద్ దివస్ ను పురస్కరించుకొని ఒక వారం, స్వచ్ఛత ప్రచారం - ఓటరు అవగాహన డ్రైవ్ లో భాగంగా కళాశాలలో స్వచ్ఛతో కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాం మోహన్ రెడ్డి, తెలంగాణ యునివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం కొ ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిందర్ రెడ్డి మాట్లాడారు. కళాశాలలోని వివిధ ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛతా కార్యక్రమం





ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

నిర్వహించారు. అనంతరం ఓటరు అవగాహన డ్రైవ్ లో భాగంగా గిరిరాజ్ కాలేజ్ ఎయిర్డ్ పబ్లిక్ అడ్మి అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ.సుధాకర్ ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియచేసి, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అతిథులు సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుర్ రాఫిక్, డాక్టర్ వై. వెణు ప్రసాద్, సెన్స్ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫిసార్స్ డాక్టర్ ఎం.సునిల, డాక్టర్ బీ. సతీష్ కుమార్, డాక్టర్ ఎం.కుమార స్వామి, డాక్టర్ పి. రవిరాజ్, డాక్టర్ ఎన్ అంబర్ సింగ్, డాక్టర్ బి. సుమలక పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి



వీడుకోలు సమావేశంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకుని, ఆ లక్ష్యాలను సాధించే దిశలో ముందుకు సాగాలని ప్రధానోపాధ్యాయులు దామోదర్ అన్నారు. బుధవారం మండలంలో సత్తెనపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీడ్కోలు సమావేశం బాధ, సంతోషంతో కూడుకున్న బావోద్వేగ సమ్మేళనం అన్నారు. ఒకే సందర్భంలో ఇన్నాళ్లు చదివిన పాఠశాలను వీడుతున్నామనే బాధ, పై తరగగతులకు పోతున్నామనే సంతోషం మిళితమై ఉంటాయని తెలిపారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణ విలువలతో బాధ్యతాయుతంగా ఉండాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బస్సీ, పద్మ, జాకిర్, కవిత, సంగమేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైనారిటీ సెల్ రఫీయొద్దీన్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైనారిటీ సెల్ రఫీయొద్దీన్

నవతెలంగాణ-లింగంపేట్

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్ ధీమ వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 15 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మదన్ మోహన్ ఆదేశానుసారం లక్ష మెజార్టీ ఇచ్చి సోనియమ్మకు గిఫ్ట్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట మైనార్టీ మాజీ ఉప అధ్యక్షలు ఫాతోద్దీన్, రాష్ట్ర నాయిని బ్రహ్మణ ఉప అధ్యక్షులు జొన్నాల రాజు, మండల మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బోర్లున్నా మోటర్లు లేవు..!

నవతెలంగాణ-భిక్కనూర్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ఎక్కడ కూడా నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు గ్రామ అధికారులకు ఆదేశాలిస్తున్నారు. కానీ సమస్య పరిష్కరించడానికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు మంజూరు కావడం లేదని అధికారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని గ్రామాలలో మంచినీటి బోర్లు పనిచేసిన ప్రతి ఇంటికి సరఫరా అయ్యే పైప్‌లైన్ సమస్య కారణంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాలలో బోర్లు వేసి ఉన్న మోటర్లు బిగించిన కారణంగా మంచినీటి కష్టాలు తప్పడం లేదు.

భిక్కనూరు, తిప్పాపూర్, రామేశ్వర్‌పల్లి గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.



వాటర్‌ట్యాంక్ నుంచి నీరు పడుతున్న గ్రామస్తులు



వృథాగా ఉన్నా బోరుబావి

రామేశ్వర్‌పల్లి గ్రామంలో వాటర్ ట్యాంకు పైప్‌లైన్ మూసిపోవడంతో నీటి సమస్య ఏర్పడగా అధికారులు సమస్య పరిష్కరిస్తున్న విషయం తెలిసింది. తిప్పాపూర్ గ్రామంలో వేసిన బోర్లు పైపులు ఉన్న అందులో బోరు మోటారు బిగించని కారణంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల నీటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అధికారులు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలలో బోరు మోటర్లు నిరుపయోగంగా ఉన్నాయని వాటిని బోర్లు వేసిన బోర్లలో బిగించి కాలనీలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుచున్నారు.

రోడ్డు మరమ్మత్తులు అస్తవ్యస్తం

- వాహన దారులకు ప్రాణసంకటం



నవతెలంగాణ-పోతంగల్

పోతంగల్ బార్డర్ నుంచి మద్నూర్, మహారాష్ట్రకు రోజు వందల సంఖ్యలో పెద్ద వాహనాలు, వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతుంటారు. ప్రస్తుతం ఎలక్షన్స్ ఉన్నందు వలన పోతంగల్‌లో చెకపోస్ట్, మహారాష్ట్ర సరిహద్దులో మహారాష్ట్ర అంతర రాష్ట్రీయ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ రెండు చెక్‌పోస్ట్‌ల మధ్యలో రోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా జరగడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్పందించి ఎటుకాని సమయంలో రోడ్డు మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది గురిచేయోద్దని వేడుకుంటున్నారు.

కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని స్థానిక కుమ్మరి గల్లీ కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయం, మసీదు సమీపంలో కంచలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తుంది. ప్రతిరోజు ముస్లింలు నమాజ్‌కు, హిందువులు ఆంజనేయస్వామి ఆలయానికి వెళుతుంటారు. కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. సమీప కాలనీలోని పిల్లలు, చిన్నారులు ఆలయ, మసీదు ప్రాంగణంలో ఆడుకుంటుంటారు. ఎక్కడ విద్యుత్ షాక్ తగులుతుందో అన్న భయంతో పిల్లల, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను అక్కడి నుంచి తొలగించి మరోచోట ఏర్పాటు చేయడమా లేదా ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచెను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుచున్నారు.

సజ్జకు కత్తెరపురుగు

- నివారణకు పలు సూచనలు ఇచ్చిన అధికారులు

నవతెలంగాణ-ధర్పల్లి

సజ్జ పంటకు సోకిన కత్తెర పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం మండలంలోని మైలారం,చల్లగర్గ గ్రామాల రైతులకు రూరల్ వ్యవసాయ అధికారి ఏడీఏ ప్రవీణ్ కుమార్ అవగాహన కల్పించారు. ప్రస్తుతము సజ్జ పంటకు కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గమనించచినట్టు తెలిపారు. వేసవి వాతావరణంలో కత్తెర పురుగు జీవిత చక్రం తొందరగా ముగించుకొని పంటను విచ్చల విడిగా తీవ్రంగా నష్టం కలిగిస్తుందని తెలిపారు. కావున ప్రస్తుతం సమగ్ర రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు విత్తనం విట్టేముందు విత్తన శుద్ధి సమయంలో ట్రీస్ ఫ్లస్ తయోమెల్లం 0.6 ఎంఎల్ ప్రతి కిలో విత్తనాల్లో కలపాలి, అలాగే ఎకరానికి 8 నుండి 10 కిలోల లింగర్షక బుట్టలను పంటకు ఒక ఫీట్ ఎత్తున అమర్చుకోవాలని తెలిపారు. బాగా ఎదిగిన లార్వాలు పంటలో గమనించినట్లయితే విషపు ఎరా ఉండలుగా చేసుకొని సాయంత్రం వేళలో వేసుకోవాలని సూచించారు. అలాగే రసాయన నివారణలో భాగంగా క్లోరత్రానేప్రోల్ 0.4 ఎంఎల్ లేదా స్పినాటోరం 0. 5ఎంఎల్ లేదా థయోమో థక్సిన్ లాండా సహలోత్రెం 0.25 ఎంఎల్ లీటర్ నాటికీ ఏవేని ఒకదానికి రెండు వందల లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమములో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఏడీఏ ప్రవీణ్

దళారులను ఆశ్రయించొద్దు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి రవీందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధన్యాన్ని విక్రయిస్తే రైతులకు సరైన గిట్టుబాటు ధర వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోపాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, ఏఈఓ చక్రపాణి, సింగం కృష్ణారెడ్డి, సతీష్ రెడ్డి, రాజశేఖర్, నరేందర్, సీఈఓ సాయి చంద్ తదితరులు పాల్గొన్నారు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ సూచించారు. మండలంలోని కోనాపూర్‌లో సింగల్ విండో ఆధ్వర్యంలో కొనసాగుతున్న వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సాయంత్రం పరిశీలించారు. వరి ధాన్యం ఎఫ్ ఏక్యూ పారమీటర్స్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట భీంగల్ ఏడీఏ మల్లయ్య, స్థానిక సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్ రెడ్డి, వ్యవసాయ వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయిరాం, విండో కార్యదర్శి నాగరాజు, రైతులు, తదితరులు ఉన్నారు

ఎన్నికల అనంతరం సంఘాల సమస్యలు తీరుస్తా

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పార్లమెంట్ ఎన్నికల తర్వాత సంఘాల సమస్యలు తీరుస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం అన్నారు. మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను మున్నూరు కాపు సంఘ సభ్యులు శాలువాతో సన్మానించి సంఘం సమస్యలను తెలియజేస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న వేళ ఎలక్షన్ కోడ్ ఉంది కాబట్టి ఎన్నికల అయిన తర్వాత సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని మాట ఇచ్చారని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిగోట్ మున్నూరు కాపు సంఘం సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

బీఐఎస్ కేర్ యాప్ పోస్టర్ విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బంగారు ఆభరణాల నాణ్యతకు సంబంధించిన 'బీఐఎస్ కేర్ యాప్' పోస్టర్‌ను వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ విడుదల చేశారు. అంతకు ముందుగానే బంగారం కొనుగోలు చేసే వినియోగదారులకు నష్టం జరుగూతుందని, జిల్లాలో కార్పొరేట్ స్థాయి బంగారు, వెండి ఆభరణాల వ్యాపారస్తులు ఇస్తున్న రశీదులపై నాణ్యతకు సంబంధించిన హెచ్యుఐడి, క్యారెట్ల శాతం వ్రాయక పోవడం వల్ల వినియోగదారులకు నష్టం జరుగూతుందనే పరిస్థితులను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మరికొందరు మధ్యతరగతి వ్యాపారస్తులు కొనుగోలు దారులకు పక్కా రశీదులు ఇవ్వకుండా "కోటేషన్"లు ఇస్తూ గ్రామీణులను తప్పుదోవ పట్టించడంపై సత్వర చర్యలు చేపట్టాలని వినియోగదారుల ప్రతినిధులు కోరారు. ఈ అంశం పైన సత్వరమే స్పందించిన జిల్లా కలెక్టర్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 ప్రకారం, వినియోగదారులకు పూర్తి సమాచారం లేని రశీదు జారీ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెండోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వి.యస్. వర్మ, సంయుక్త కార్యదర్శి కె.సాయి కుమార్‌లు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చెరువులో పడి వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముల్లంగి(బి) గ్రామంలో వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మేకల సాయమ్మ (60) మానసిక స్థితి బాగోలేక మూడు రోజుల క్రితం చెరువులో పడి బుదవారం తేలినట్లు తెలిపారు. స్థానికులు గమనించి పోలీసులకు సంచారం ఇచ్చారన్నారు. మృతురాలి భర్త మేకల రాములు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు.